www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
03 నవంబర్ 2025
సంపుటి:3 సంచిక: 307

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## జగజ్జేత భారత్

భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయ సందర్భం! ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న వన్డే ప్రపంచకప్ ట్రోఫీ ఎట్టకేలకు భారత్ దరిచేరింది. సొంత ఇలాఖాలో తమ కలల కప్‌ను తొలిసారి సాకారం చేసుకుంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి టీమ్ఇండియా జగజ్జేతగా నిలిచింది. షెఫాలీవర్మ, దీప్తిశర్మ అర్ధసెంచరీలతో భారీ స్కోరు అందుకున్న భారత్..స్ఫూర్తిదాయక పోరాటంతో కదంతొక్కింది. లక్ష్యఛేదనలో సఫారీ కెప్టెన్ లారా వోల్వార్డ్ సెంచరీ పోరాటం సఫలం కాలేకపోయింది. దీప్తిశర్మ ఐదు వికెట్ల విజృంభణతో సఫారీలు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కోట్లాది భారతీయుల ఆకాంక్షలను నిజం చేస్తూ భారత మహిళామణులు మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించారు.



## జయహో భారత్

- ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం
- ఇది సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి జరిగింది
- కక్ష్యలోకి ఉపగ్రహం విజయవంతంగా చేరింది
- ఉపగ్రహం 15 ఏళ్ల పాటు సేవల అందించనుంది
- ఈ ప్రయోగం భారత కీర్తి ప్రతిష్ఠలను మరో మెట్టుపైకి
- ఉపగ్రహం బరువు మొత్తం 4,410 కిలోలు

04

# మరణ మృదంగం..
# 18 మంది మృతి

- రాజస్థాన్‌లో మరో ఘోరం జరిగింది
- ఆగి ఉన్న ట్రక్కును ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది
- ఈ ఘటనలో 18 మంది మృతి చెందారు
- సీఎం భజన్ లాల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు
- ఇటీవలే ఓ ప్రైవేటు బస్సు మంటల్లో దగ్ధమైంది
- ఈ ఘటనలో 26 మంది సజీవ దహనం
- జసల్మేర్ రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
రాజస్థాన్‌లో మరో ఘోరం జరిగింది. రాజస్థాన్‌లోని ఫలోడి వద్ద మటోడా గ్రామం పరిధిలో ట్రావెల్ బస్సు ఆగి ఉన్న ట్రక్కు ను ఢీ కొన్న ఘటనలో 18 మంది మృతి చెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు సమీప ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో మహిళలు, పిల్లలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితులంతా జోధ్ పుర్ లోని సూర్ సాగర్ కు చెందినవారుగా తేలింది. మృతులంతా బికనూర్ లోని కోలాయత్ ఆలయంలో దర్శనం చేసుకుని తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఇటీవల ఓ ప్రైవేటు బస్సు మంటల్లో దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. అయితే ఈ ఘటన మరువకముందే రాజస్థాన్ లో మరో విషాదం నెలకొంది.

మిగతా 4లో..





## బస్తీలో మూడు రంగుల జెండా
## ఎగరడం ఖాయం

- జూబ్లీహిల్స్ చుట్టూ తెలంగాణ రాజకీయం
- పార్టీలు ఉపఎన్నికల ప్రచారం పైనే ఫోకస్
- ప్రచారానికి తొమ్మది రోజులే సమయం
- నవీన్ యాదవ్ తరఫున రంగంలోకి సీఎం
- కార్నర్ మీటింగ్స్‌తో ప్రజల మధ్యకు వచ్చారు
- నేరుగా వెళ్లి జనంతో మాట్లాడుతున్నారు
- అభివృద్ధికి ఓటు వేయాలని కోరుతున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ రాజకీయం మొత్తం జూబ్లీహిల్స్ చుట్టూ తిరుగుతోంది. మూడు ప్రధాన పార్టీలు ఉపఎన్నికల ప్రచారంపైనే ఫోకస్ పెట్టాయి. ఇంకా ప్రచారానికి తొమ్మది రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి బడా

మిగతా 2లో..

## మీరు చల్లగా ఉండాలయ్యా!

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గొప్ప మనసు
- పేదింటి బిడ్డకు పునర్జన్మను ప్రసాదించారు
- కిడ్నీఆపరేషన్‌కు రూ.12 లక్షలు అందజేశారు
- ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చారు
- గతంలోనూ ఇలాంటి మంచి కార్యక్రమాలు
- కేతేపల్లిలో ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు



02



## శాడిస్ట్ ప్రిన్సిపాల్

- కానిస్టేబుల్ జుట్టుపట్టి ఈడ్చేసిన స్టూడెంట్స్
- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఉద్రిక్తత
- ప్రిన్సిపల్ వేధిస్తున్నారని రోడ్లపైకి విద్యార్థినులు
- రహదారిపై మెరుపు ధర్నాకు దిగారు
- ప్రిన్సిపాల్ అక్రమాలకు పాల్పడుతుందన్నారు
- విద్యార్థినులతో ఓ మహిళా కానిస్టేబుల్ అత్యుత్సహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రిన్సిపల్ అక్రమాలు, విద్యార్థినీలకు వేధింపులపై విసిగిపోయిన

మిగతా 2లో..

## బీసీల కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిందే

- బీసీ జేఏసీ రాష్ట్రస్థాయి విస్తృత స్థాయి సమావేశం
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ
- నవంబర్ లో పార్లమెంటు ముట్టడి చేపడతాం
- బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత బీజేపీ, కాంగ్రెస్ లదే
- బీజేపీ నేతగా కాదు బీసీ బిడ్డగా వచ్చానన్న ఈటెల
- కేతేపల్లిలో ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు

02



## 500 రోజుల్లో మళ్లీ
## సీఎంగా కేసీఆర్

- తెలంగాణ భవన్‌లో ఆదివారం హైడ్రా ఎగ్జిబిషన్
- మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు
- రేవంత్ సర్కార్ పే - హైడ్రా పేరుతో ప్రభుత్వం అరాచకాలు చేస్తుంది
- మణుగూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి
- ఫర్నిచర్ ధ్వంసం చేసి నిప్పు పెట్టారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
'పేదవాడికి ఒక న్యాయం.. ఉన్నవాడికి ఒక న్యాయం.. ఇది రేవంత్ రెడ్డి తీరు. హైడ్రా బాధితుల బాధ అందరికీ అర్థం కావాలి. పేదవాడి ఇంటికి బుల్డోజర్ వచ్చింది.. ఆ బిల్డర్ల జోలికి ఎందుకు వెళ్లలేదో ప్రభుత్వం చెప్పాలి' అని రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి కేటీఆర్ నిలదీశారు. 'పేదల ఇళ్లను రేవంత్ రెడ్డి కూల్చేశాడు. ప్రభుత్వానికి అంతా సమానమైతే పెద్ద వాళ్ల జోలికి ఎందుకు వెళ్లలేదు? వారికి ఎందుకు నోటీసులు ఇవ్వలేదు' అని ప్రశ్నించారు. పెద్ద పెద్ద బిల్డర్ల జోలికి ఎందుకు వెళ్లలేదని అడిగారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆదివారం హైడ్రా ఎగ్జిబిషన్ నిర్వహించారు. హైడ్రా అరాచకాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కొంత మంది హైడ్రా బాధితులతో కేటీఆర్ మాట్లాడి.. హైడ్రా అరాచకాలు

మిగతా 2లో..



## మేం వచ్చిందే టైం

- ఆగ్రోస్‌లో ఉద్యోగుల తీరు మారడం లేదు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం
- ఉద్యోగులకు మెమోలు సైతం జారీ చేశారు
- ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు
- ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి
- పనితీరును మార్చుకోవాలని హెచ్చరికలు
- హాజరు వివరాలు రోజూవారీగా అందించాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై దృష్టిసారించారు. పనిచేయని అధికారులు, శాఖలను గుర్తించి వాటిపై చర్యలకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే అన్ని కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితులు, ఆస్తులపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశాలు ఇచ్చినా నివేదిక ఇవ్వలేదని సమాచారం. మరోసారి

మిగతా 2లో..

# 500 రోజుల్లో మళ్లీ సీఎంగా కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

ఎలా ఉన్నాయో వివరించారు. ఈ సందర్భంగా హైడ్రా బాధితుల కన్నీళ్లు.. వేడుకోలుతో అక్కడ భావోద్వేగ వాతావరణం ఏర్పడింది.

ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'హైడ్రా పేరుతో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు, మూసీతో, హైడ్రాతో ఎంతో మంది బాధితులుగా మారారు. కేసీఆర్ హయాంలో ఎక్కడ చూసిన కట్టడాలే కనిపిస్తాయి. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాం. వైట్ హౌస్‌ను తలదన్నేలా సచివాలయం కట్టాం. దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కట్టుకున్నాం. హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు కట్టుకున్నాం. ప్రతి జిల్లాలో కలెక్టరేట్ లు కట్టుకున్నాం, నీటి ప్రాజెక్టులు కట్టుకున్నాం' అని మాజీ మంత్రి కేటీఆర్ వివరించారు.

'ఒకటీ రెండు కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కొత్త నిర్మాణాలు చేసుకున్నాం. ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఒక్క ఇటుక పెట్టలేదు.. ఒక్క కొత్త కట్టడం లేదు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి చేసింది కూలగొట్టడమే. రేవంత్ రెడ్డి దుర్మార్గంతో జరిగిన అన్యాయానికి ఎంతో మంది బాధితులుగా మారారు. 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం రానుంది. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం' అని హైడ్రా బాధితులకు మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు.

మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పార్టీ కార్యాలయం దహనం చేసిన ఘటన పెను దుమారంగా మారింది. బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ అల్లరి మూకలు దాడి చేశారు. అంతేకాకుండా బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా గద్దెను ధ్వంసం



చేశారు. ఫ్లెక్సీలు చింపి, ఫర్నిచర్ ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి దిగారు. దీంతో మణుగూరులో ఒక్కసారిగా టెన్షన్ వాతావరణం ఏర్పడింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గూండాల రాజ్యం, రౌడీయిజం పెరిగిపోయిందన్నారు.

ఈ సంఘటన తెలుసుకున్న వెంటనే కేటీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. 60 లక్షల భారత రాష్ట్ర సమితి కుటుంబమంతా మణుగూరు పార్టీ శ్రేణులకు తోడుగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలన్నారు. అతి త్వరలోనే మణుగూరును సందర్శించి, అదే ప్రాంతంలో పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం చేసుకుందామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ రౌడీ మూకలకు, వారి అరాచకత్వానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం నలుమూలలా, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని దాకా ప్రతిచోటా రౌడీల రాజ్యం, తుపాకీల హవా నడుస్తోందని, అరాచకత్వం పాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడే రోజు దగ్గర్లో ఉందని తెల్చిచెప్పారు. మరోవైపు.. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలి వద్ద భారీగా మోహరించి పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ కార్యాలయాన్ని ఆక్రమించి బీఆర్ఎస్ కార్యాలయంగా చేసుకున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఈ ఘటనతో ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ ల మధ్య వార్ పీక్స్ కు చేరింది.

# మేం వచ్చిందే టైం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయరంగానికి అనుబంధంగా ఆగ్రోస్, మార్క్ ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, గిడ్డంగుల కార్పొరేషన్, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్లు ఉన్నాయి. ఇవి పంట ఉత్పత్తుల కొనుగోలు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాల క్రయ విక్రయ వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి.

వీటితోపాటు మార్కెటింగ్ సంస్థ కార్పొరేషన్ల మాదిరిగానే పలు పనులను చేస్తున్నది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అనుబంధ కార్పొరేషన్లపై మంత్రి తుమ్మల ప్రత్యేక ఫోకస్ పెట్టారు. వాటి కార్యకలాపాలు, ఉద్యోగుల పనితీరు, రైతులకు అందజేస్తున్న సేవలపై దృష్టిసారించారు. అకస్మాత్తుగా కార్పొరేషన్ల కార్యాలయాలను తనిఖీ చేస్తున్నారు. ఉద్యోగులు సమయపాలన, ఆ కార్యాలయం పనితీరును అధ్యయనం చేస్తున్నారు. అందులో భాగంగానే గత నెలలో ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్ కార్యాలయాలను సైతం తనిఖీ చేశారు. ఉద్యోగులు సమయ పాలన పాటించకపోవడంతో మంత్రి సీరియస్ అయ్యారు. అంతేకాదు ఆ ఉద్యోగులకు మెమోలు సైతం జారీ చేయాలని, సంజాయిషీ తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఆయా శాఖల ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరును మార్చుకోవాలని, ఉన్నతాధికారులు సైతం మానిటరింగ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అంతేకాదు ఎప్పటికప్పుడు మంత్రి ఆరా తీస్తున్నారు. వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) పై, ఆ సంస్థలోని ఉద్యోగుల పనితీరుపై మంత్రికి ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. దీంతో శనివారం అకస్మాత్తుగా ఆగ్రోస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. దీంతో ఉద్యోగుల పనితీరు, వారి సమయ పాలన వెలుగులోకి వచ్చింది. 10.30 గంటలు దాటినా సగం మంది ఉద్యోగులకు కూడా కార్యాలయానికి రాలేదు. ఏ కార్యాలయ ఉద్యోగులకు అయినా 5 నిమిషాలు మినహాయింపు ఉంటుంది. అంటే 10.05 గంటలకు హాజరుకావాల్సి ఉంటుంది. కానీ సంస్థ జీఎం సైతం హాజరుకాకపోవడంతో మంత్రి సీరియస్ అయ్యారు. గతంలోనే పలు కార్పొరేషన్ల అధికారులను మంత్రి వార్నింగ్ ఇచ్చారు. అనుబంధ కార్పొరేషన్లు రైతులకు సేవలందించాలని, ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఆదేశాలు ఇచ్చారు.

అయినప్పటికీ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శించడం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. కార్పొరేషన్లకు చెందిన కమిషనర్లు దృష్టి సారించకపోవడమా? లేకుంటే ప్రభుత్వ ఉద్యోగం అంటే అలసత్వమా? లేక మంత్రి ఆదేశాలను బేఖాతరు చేయడమా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై చర్యలు తీసుకోకపోవడమే.. లేకుంటే పర్యవేక్షణ లోపించడంతోనే అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీనికి తోడు ఆగ్రోస్ కార్యాలయంలో ఎంఐటీ భవనాలు, మెయింటైనెన్స్ సరిగా లేదు. నిత్యం కార్యాలయంలో ఉన్నతాధికారులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వాటిపై దృష్టిసారించకపోవడం ఇప్పుడు విమర్శలకు దారితీస్తుంది. ఇది ఉద్యోగుల పనితీరుకు అద్దంపడుతుంది. మంత్రి తుమ్మల సైతం అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు చర్యలకు ఆదేశించినట్లు సమాచారం.

# శాడిస్ట్ ప్రిన్సిపాల్

(మొదటిపేజీ తరువాయి)

నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు వందలాది మంది రోడ్లపైకి వచ్చి రహదారిపై మెరుపు ధర్నాకు దిగారు. ప్రిన్సిపాల్ శైలజ అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. మెస్ సరుకుల తరలింపు, విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తుందని ఆరోపించారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలంటూ నడిరోడ్డుపై విద్యార్థినిల ధర్నాకు దిగారు. తమ దగ్గర లంచాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లయిన విద్యార్థుల నుంచి పరీక్షలు రాయడానికి రూ.పది వేల వరకు లంచాలు తీసుకుంటుందన్నారు. టీసీలు ఇవ్వడానికి రూ.3 వేల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తోందన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఆమెకు సహకరిస్తున్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

తమ సమస్యలపై గళమెత్తిన విద్యార్థినీలు పట్టణంలోని చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. విద్యార్థినులను ఆందోళన నుంచి ఆపడానికి అధ్యాపక బృందం విపరీతంగా ప్రయత్నం చేసింది. కానీ విద్యార్థినులు వారిని లెక్కచేయకుండా రోడ్లపైకి వచ్చి న్యాయం చేయాలి అంటూ నినదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని ఆందోళన విరమింపజేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో విద్యార్థినులతో ఓ మహిళా కానిస్టేబుల్ అత్యుత్సహం ప్రదర్శించారు. వారితో వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో సహనం కోల్పోయిన కానిస్టేబుల్ ఓ విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో మిగతా విద్యార్థినులు ఆగ్రహానికి గురై మహిళా కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు. ఈ క్రమంలో నడిరోడ్డుపై జుట్లు పట్టుకొని కానిస్టేబుల్, స్టూడెంట్స్ కొట్టుకున్నారు. కొంతమంది విద్యార్థినీలు ఆమెపై దాడి చేశారు. తమకు అన్యాయం జరిగితే న్యాయం చేయాలని ఆందోళన చేస్తుంటే తమనే కొడతారా? అని విద్యార్థినులు ఈ సందర్భంగా పోలీసులను నిలదీశారు. కానిస్టేబుల్ పై దాడితో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

అదుపు చేసే క్రమంలో కానిస్టేబుల్‌తో వాగ్వాదం ఘర్షణకు దారితీసింది.ఈ ఘటనతో అక్కడున్న వారంతా నిశ్చేష్టులయ్యారు. జిల్లా కలెక్టర్ వచ్చి తమ సమస్యను పరిష్కరించేవరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థినులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థినులను పోలీసుల బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని అక్కడి నుంచి తీసుకెళ్లారు. విద్యార్థినుల ధర్నాతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు వచ్చి విద్యార్థులను సముదాయించారు. అయినా వారు వినలేదు. .ఈ క్రమంలో మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్, విద్యార్థినుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ విద్యార్థినిపై ఆమె చేయి చేసుకుంది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థినులు కానిస్టేబుల్‌ను జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లారు.

# బీసీల కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిందే



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఈనెల 20వ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశంలోనే రాజ్యాంగ సవరణ చేసి బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోద తెల్పాల్సిందేనని, లేదంటే గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీలు ఇక ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడాలని అఖిలపక్ష పార్టీల నేతలు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులు సంయుక్తంగా హెచ్చరించారు. ఆదివారం, నవంబర్ 2వ తేదీన హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న కళింగ కల్చరల్ సెంటర్ లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు భవిష్యత్ కార్యాచరణ పై బీసీ జేఏసీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహించింది ఈ సమావేశానికి బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించగా, కో చైర్మన్ దాసు సురేష్, కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణలు సమన్వయం చేశారు

ఉదయం 11 గంటలకు ప్రారంభమైన జేఏసీ సమావేశం సాయంత్రం 6 గంటల వరకు 7 గంటల పాటు సుదీర్ఘంగా కొనసాగింది సభ చాలా ఉత్కంఠ భరితంగా, సమాలోచనలతో దీర్ఘకాలిక వ్యూహం తో జరిగింది ఈ సమావేశం లో బీసీ సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ, న్యాయవాద, డాక్టర్స్, మేధావుల సంఘాల నేతలతో పాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నుండి ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు వేలాదిమంది హాజరయ్యారు

ఈ సమావేశానికి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, మాజీ ఎంపీ వి హనుమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, మాల మానాడు జాతీయ అధ్యక్షులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్, ప్రముఖ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి, సినీ దర్శకులు ఎన్ శంకర్, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు జూలూరీ గౌరీశంకర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్, పాల్గొని మాట్లాడారు. బీసీ జేఏసీ సమావేశానికి బీజేపీ నేతగా తాను రాలేదని, ఒక బీసీ బిడ్డగా హాజరయ్యానని, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ చేస్తున్నాం పోరాటానికి తన వంతు మద్దతు ఉంటుందని ఈటెల రాజేందర్ తెలిపారు దేశంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వచ్చిన తర్వాత రిజర్వేషన్లు లేని వర్గం అంటూ ఏదీ లేదని రిజర్వేషన్లు అనుభవిస్తున్న సామాజిక వర్గాలలో బీసీలకే అన్యాయం జరుగుతుందని దగా పడ్డ బీసీలు దండుగట్టే సమయం ఆసన్నమైందన్నారు బీసీ జేఏసీ నాయకత్వం ఏ రాజకీయ పార్టీలో లేనటువంటి నిస్వార్థంతో నిజాయితీతో బీసీల కోసం ఉద్యమించేవారు బాధ్యత తీసుకోవాలని గమ్యాన్ని ముద్దాడె వరకు ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనుకకు తగ్గే ప్రసక్తి లేదని, రాహుల్ గాంధీ ఆదేశించిన విధంగానే కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో అసెంబ్లీలో చేసిన చట్టం అమలు చేయాలని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా కూటమి తరపున ఒత్తిడి తీసుకువస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం తరపున త్వరలోనే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుస్తామని వారు అన్నారు బీసీ రిజర్వేషన్ల విషయంలో బీసీ జేఏసీ చేస్తున్న పోరాటానికి బీసీ బిడ్డలుగా కాంగ్రెస్ పార్టీగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ నేతలు వి హనమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మైనింగ్ చైర్మన్ ఈరవత్ అనిల్ వెల్లడించారు

దశాబ్దాలుగా బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతూనే ఉందని పార్టీలను పక్కనపెట్టి బీసీలకు సామాజిక న్యాయం దక్కడానికి తెలంగాణలో మరో పోరాటాన్ని రూపొందించాలని వారు పిలుపునిచ్చారు బీసీ రిజర్వేషన్ల సాధనలో బీసీలు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదు అనే రీతిలో ఒక్కటే జట్టు గట్టి పోరాడాలని, టిఆర్ఎస్ పార్టీగా, బీసీ బిడ్డలుగా బీసీ జేఏసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు వెల్లడించారు తెలంగాణ ఉద్యమ తరాహాలోనే బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని వారు సూచించారు

బీసీ ఉద్యమానికి ఎమ్మార్పీఎస్ వెన్నంటి ఉంటుందని, బయట నుండి మద్దతు ఇవ్వకుండా బీసీ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు బీసీ ఉద్యమాన్ని శాంతియుతంగా ప్రజాస్వామ్యుతంగా ముందుకు తీసుకెళ్తే కచ్చితంగా విజయం సాధించడం ఖాయమన్నారు నాటి దేశ స్వాతంత్ర పోరాటం నుండి నేటి వర్గీకరణ పోరాటం వరకు శాంతియుతంగా పోరాడితేనే విజయం సిద్ధించిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ బిజెపిలను ఒత్తిడి పెంచడానికి శాంతియుత పోరాటమే లక్ష్యంగా బీసీ ఉద్యమం ముందుకు సాగలని ఆయన తెలిపారు బీసీ జెఎసి రాజీ లేకుండా నిజాయితీగా కొట్లాడాలని, జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వాన్ని ఎమ్మార్పీఎస్ బలపరుస్తుందని ఆయన వెల్లడించారు.

బీసీలు ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో ఒంటరి కాదని బీసీ సమాజానికి సకల జనులు అండగా నిలబడతారని ఇది మొన్న జరిగిన రాష్ట్ర బంద్ తో తేటతలమైందన్నారు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్. బీసీ ఉద్యమానికి మాల మాదిగ, ఆదివాసి, గిరిజన, మైనార్టీ సమాజం తోడుగా ఉంటుందని రాజకీయాలకు అతీతంగా బహుజనులు ఏకమై బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని బలపరుస్తామని ఆయన వెల్లడించారు. తరతరాలుగా బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దడానికి అంబేద్కర్ పూలే చూపించిన మార్గంలో బీసీలు ఐక్యమై గల్లీ నుండి ఢిల్లీ వరకు దండుగట్టాలని, పోరాడితే పోయేది ఏమీలేదని, చరిత్రలో పోరాడిన సమాజమే విజయ తీరాలకు చేరిందని బీసీలు కూడా తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు కదలాలని ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు.

# కేకే మరో ఆరా మస్తాన్..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని విజయం అదీ కూడా.. 55 శాతం ఓట్లతో విజయం సాధిస్తుందని కేకే సర్వేస్.. కేకే తేల్చేశారు. ఆయన ఈ మేరకు తన సర్వే డీటైల్స్ తో ఓ వీడియో విడుదల చేశారు. గతంలోఆయన చేసిన సర్వేలు చాలా వరకూ కరెక్ట్ అయ్యాయి. కానీ హర్యానాలో మాత్రం పూర్తి రివర్స్ అయ్యాయి. అయన సర్వేలు తప్పుగా తేలిన సందర్భాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. మిగతా వాటి సంగతి ఏమో కానీ.. జూబ్లిహిల్స్ ఫలితం విషయంలో మాత్రం తన విశ్వసనీయతను .. ఇంత కాలం పెంచుకున్న నమ్మకన్ని పణంగా పెట్టేశారని అనుకోవచ్చు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న ఏడు డివిజన్లలో .. నాలుగు చోట్ల అరవైశాతానికిపైగా బీఆర్ఎస్ కు ఓటు వేస్తారని కేకే సర్వేస్ తేల్చింది. బోరబండ, ఎర్రగడ్డ, షేక్ పేట, శ్రీనగర్ కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ అరవై శాతం ఓట్లు సాధిస్తుందని చెప్పడం చిన్న




విషయం కాదు. ఇదేమీ గ్రేటర్ ఎన్నిక కాదు. బీఆర్ఎస్ క్యాడర్ చాలా వరకూ ఇతర పార్టీల్లో చేరిపోయింది. సిటీ పరిధిలో ఇంత ఏకపక్షంగా ఓటింగ్ జరుగుతుందని ఎవరూ అనుకోరు. కానీ కేకే సర్వే తాము ఎంతో పరిశోధన చేసి అదే నిజమని తేల్చారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కేకే చేసిన సర్వే ఘోర తప్పిదంగా మారింది. కాంగ్రెస్కు 75 సీట్లు వస్తాయని తేలిస్తే.. చివరికి 11 సీట్లు వచ్చాయి. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధిస్తుందని అంచనా వేశారు. కానీ బీజేపీ విజయం సాధించింది. ఇప్పుడు ఇలాంటి సర్వేను ప్రకటిస్తే ఆయన బీఆర్ఎస్ అమ్ముడుపోయారని ఇతరులు అంటారు. అదే అంటున్నారు. ఆయన సర్వేలన్నీ లాటరీలని అంటున్నారు. ఇప్పుడు కేకే కూడా తన సర్వేలు నిజమని నమ్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లాటరీ వేస్తే ఎప్పుడూ సక్సెస్ రాదు. జూబ్లిహిల్స్ లో ఫలితం తేడా వస్తే కేకే తన నమ్మకాన్ని మొత్తం పోగొట్టుకున్నట్లుగా అవుతుంది.

దేశంలో సర్వేలు చేసే సంస్థల్లో యాక్సిస్ మై ఇండియాకు చాలా పేరు ఉంది. ఆ సంస్థకు విస్తృతమైన నెట్ వర్క్ ఉంది. అలాంటిది వారు చేసే సర్వేల్లోనే తప్పులు దొర్లుతూ ఉంటాయి. కేకే దానికి అతీతం కాదు. ఎందుకంటే ఆయన ఫీల్డులో సర్వేలు చేస్తారా లేకపోతే.. మీడియాలో వచ్చే వార్తల్ని బట్టి అనాలసిస్ చేసుకుంటారా అన్నది ఎవరికీ తెలియదు. ఫీల్డ్ సర్వేలు చేయాలంటే కోట్లు ఖర్చు అవుతుంది. ఆఫీసులో గ్రాఫిక్స్ చేసుకోవాలంటే సింపుల్ గా అయిపోతుంది. కేకే .. ఏ పని చేస్తున్నారో ఎన్నికల ఫలితాల సమయంలో తేలుతుంది. ఫలితం తేడా వస్తే.. కేకే కూడా.. మరో ఆరా మస్తాన్ లా మిగిలిపోతారు.

# మీరు చల్లగా ఉండాలయ్యా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గొప్ప మనసు చాటుకున్నారు. పేదింటి బిడ్డకు పునర్జన్మను ప్రసాదించారు. రూ.12 లక్షల సొంత డబ్బుతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించారు. వివరాల్లోకి వెళితే.. మునుగోడు నియోజకవర్గం కొండూరు గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు నెల్లి గణేష్(26) గత కొద్ది కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. కిడ్నీలు దెబ్బతిన్నాయని కిడ్నీ మారిస్తే కానీ బతకదని డాక్టర్లు చెప్పారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో ఏం చేయలేక రోజూ ఏడుస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక నేతలు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కిడ్నీ మార్పిడి చికిత్స చేయడానికి కావలసిన ఏర్పాట్లు చేశారు. రూ.12.50 లక్షల సొంత డబ్బుతో ఆపరేషన్ చేయించారు. గణేష్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. చికిత్స అనంతరం ఆదివారం కామినేని ఆసుపత్రికి వెళ్లి గణేష్ బాగోగులు తెలుసుకున్నారు. గణేష్ కుటుంబ సభ్యులకు నేనున్నాను మీరు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చారు. తన కుమారునికి సొంత ఖర్చులతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించి కార్పొరేట్ వైద్యం అందించిన రాజగోపాల్ రెడ్డికి గణేష్ తల్లిదండ్రులు చేతులెత్తి నమస్కరించారు. నా కుమారునికి పునర్జన్మ ప్రసాదించావన్నారు. నెల్లి గణేష్ కు సొంత ఖర్చులతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించడంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉదార స్వభావానికి సహాయం చేసే గుణానికి నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో ముందుంటారు. మునుగోడు మండలం పులిపల్వల గ్రామానికి చెందిన మునుగోటి సైదులు అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన ఒక్కగానొక్క కుమారుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఓ ప్రైవేటు హాస్పిటల్ లో జాయిన్ చేశారు. పేదరికంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సైదులు పరిస్థితి గురించి తెలుసుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. చలించిపోయారు. సైదులు కుమారుడి చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించారు. ట్రీట్మెంట్ కి అవసరమైన రూ.2 లక్షల ఆర్థిక సాయం సైదులు కుటుంబానికి అందజేశారు రాజగోపాల్ రెడ్డి.

నాంపల్లి మండలం కేతేపల్లిలో విద్యుత్ షాక్‌తో మరణించిన యాదయ్య, మోహనయ్య కుటుంబాలను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజమోని వెంకటయ్య కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం అపోలో ఆసుపత్రికి తరలించాలని..వైద్యానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు.



# బస్తీలో మూడు రంగుల జెండా ఎగరడం ఖాయం



(మొదటిపేజీ తరువాయి)

నేతలు బస్తీలో ప్రచారం చేస్తున్నారు. దీంతో వింటర్‌లో పొలిటికల్ హీట్ తారాస్థాయికి చేరుకుంది. ఇప్పటి వరకు మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరఫున ప్రచారం చేశారు. ఇప్పుడు రంగంలోకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగారు. కార్నర్ మీటింగ్స్‌తో ప్రజల మధ్యకు వచ్చారు. ప్రత్యర్థులపై విరుచుకుపడుతూనే, రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను వారి ముందు పెడుతున్నారు. కేవలం మీటింగ్‌లకే పరిమితం కాకుండా నేరుగా వెళ్లి జనంతో మాట్లాడుతున్నారు. స్థానికంగా ఉండే సమస్యలు ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి మార్గాలు చూపిస్తామంటున్నారు. నవీన్ యాదవ్, అజారుద్దీన్ ఇద్దరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతారని చెప్పుకొస్తున్నారు. స్థానికంగా ఉండే ముస్లిం ఓటర్లను ఆకట్టుకునేందుకు బీఆర్ఎస్ బీజేపీ కలిసే పని చేస్తున్నాయని వారిని నమ్ముకుంటే కచ్చితంగా ఇబ్బంది పడతారని అంటున్నారు. వారి మాటలకు బోల్తాపడొద్దని హితవు పలుకుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ నేతలకు కౌంటర్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగారు. కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో డిపాజిట్ దక్కకుండా ఓడిస్తేనే వారు ఇచ్చిన ఆరు హామీలు కచ్చితంగా అమలు చేస్తారని ప్రచారం చేస్తున్నారు. ఆయన కూడా షేక్‌పేటలో తొలి రోడ్‌షో నిర్వహించారు. బాకీ కార్డులు చూపించి ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు వాటి గురించి నిలదీయాలని చెబుతున్నారు. ఓడిపోతున్నామని తెలిసినందున ఓటర్లను మభ్యపెట్టేందుకు అజారుద్దీన్‌కు మంత్రిపదవి ఇచ్చారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీత విజయం ఖాయమైపోయిందని, అయితే మెజార్టీ ఎంత అనేది తేలాల్సి ఉందని అన్నారు కేటీఆర్. కాంగ్రెస్, బీజేపీ ఎంత కలిసి వచ్చినా గెలిచేది లేదని అభిప్రాయపడ్డారు. సాధారణంగా గెలవలేమని చెప్పి రౌడీయిజం చేస్తున్నారని, అందుకే ఆకు రౌడీని పోటీలో నిలబెట్టారని నవీన్ యాదవ్‌ను ఉద్దేశించి కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చి రెండేళ్లు అవుతున్నా ఒక్క ఇంటిని కూడా కట్టి ఇవ్వలేదని, కానీ హైడ్రా పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో చేసిన మంచిని, రెండేళ్లలో కాంగ్రెస్ పాలనలో లోపాలు, అమలు కాని హామీలు ప్రస్తావిస్తూ ఓటర్లను మెప్పించే ప్రయత్నాల్లో కేటీఆర్ ఉన్నారు. ఆ దిశగానే ఆయన ప్రసంగాలు సాగుతున్నాయి. కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌తో ప్రజల్లోకి వెళ్తుంటే... బీఆర్ఎస్ రోడ్‌షోలతో ఆకట్టుకుంటే.... బీజేపీ ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ తప్పులు ప్రజలకు తిప్పలు అన్నట్టు ఛార్జ్‌షీట్‌ను విడుదల చేయబోతోంది. ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు నేతలంతా ఇంటింటికీ వెళ్లి ఓటర్ తలుపు తడుతున్నారు. నవీన్ యాదవ్ కాంగ్రెస్ అభ్యర్థి కారని, ఎంఐఎం నిర్ణయించిన వ్యక్తిగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం సహాయంతో జూబ్లీహిల్స్‌లో గట్టెక్కే ప్రయత్నాల్లో ఉందని ఆరోపిస్తున్నారు. పోటీలో బీఆర్ఎస్ లేనేలేదని, కేవలం ఈ పోటీ ఎంఐఎం, బీజేపీ మధ్యే ఉంటోందని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. తెలంగాణలో అధికారంలోకి లేకపోయినా చాలా మంచి చేస్తున్నామని జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డిని గెలిపిస్తే ప్రజలకు మరింత మంచి జరుగుతుందని తెలిపుతున్నారు. ఇలా మూడు పార్టీల ముఖ్య నేతలు ఒకేసారి జూబ్లీహిల్స్ బస్తీల్లో తిరుగుతూ ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే ఏదేమైనప్పటికీ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిచి మూడు రంగుల జెండా ఎగురవేయడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# అర్బన్ పార్కులో వన్యప్రాణి రక్షణ దిగజారింది

- పార్క్ నుంచి బయటకు వచ్చిన మచ్చల దుప్పి
- ప్రమాదంలో గాయపడటంతో అధికారులుపై విమర్శలు
- రక్షణ ఏర్పాట్ల లోపం, పర్యవేక్షణ లేకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం

**సత్తుపల్లి, విశాలభారతి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణం లో ఉన్న అర్బన్ పార్క్ వన్యప్రాణుల కోసం నిర్మించిన ఆశ్రయం కాదు, నిర్లక్ష్యానికి నిలయంగా మారిందనే ఆవేదన వ్యక్తమవుతోంది. సరైన రక్షణ, భద్రతా ప్రహరీలు సరైన ఎత్తులేని కారణంగా పార్కులోని జంతువులు నీటి సౌకర్యం ఉన్నా తరుచూ బయటకు వస్తుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా పార్కు బయటకు వచ్చిన మచ్చల దుప్పి ఒక ఇంటి ప్రాంగణంలోకి ప్రవేశించడంతో అక్కడ ఉన్న చిన్నపిల్లలు భయంతో కేకలు వేయగా దుప్పి కంగారు పడి రోడ్డు దాటేటపుడు బస్సు వెనుక భాగానికి తగిలి తీవ్రంగా గాయపడింది. ఘటనపై స్పందించిన అటవీ శాఖ అధికారులు ప్రథమ చికిత్స చేసి దుప్పిని తిరిగా పార్కులోకి తరలించినప్పటికీ, ఈ సంఘటన వన్యప్రాణుల రక్షణ వ్యవస్థపై వారి బాధ్యతారాహిత్యాని గుర్తు చేస్తుంది. గత కొన్ని నెలలుగా పార్కులో దుప్పులు వేటగాళ్ల దాడితో గాయపడి చనిపోయిన ఘటనలు లేకపోలేదు. కొన్నిసార్లు కుక్కల దాడి కారణమని చెబుతూనే ఉన్నా, అసలు సమస్య పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం, సరైన భద్రత లేకపోవడం అని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో వన్యప్రాణులు ఇలా ప్రమాదాలకు గురవుతుంటే, అటవీశాఖ ఏం చూస్తోంది? ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని స్థానికులు మండి పడుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణపై అధికారులు కనీసం దృష్టి పెట్టకపోవడమే ఇలాంటి ఘటనలకు దారి తీస్తోందని వారు విమర్శిస్తున్నారు. పార్కులో పూర్తి స్థాయి సెక్యూరిటీ, సీసీ కెమెరాలు, బౌండరీ వాల్ బలోపేతం, బాధ్యతగల పర్యవేక్షణ బృందం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





## ఘనంగా రుద్రాభిషేకము సుదర్శన హోమం

**కూకట్ పల్లి విశాలభారతి:** న్యూ బోయినపల్లి ఓల్డ్ ఎయిర్పోర్ట్ రోడ్డు శ్రీ వెంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృత కళాశాల పాఠశాల యందు కార్తీకమాసం చిలుకురు ద్వాదశి సందర్భంగా దశాబ్దాలుగా చేయు రుద్రాభిషేకము సుదర్శన హోమము తులసీ దామోదర కళ్యాణము సత్యనారాయణ వ్రతము సాంప్రదాయ పద్ధతిలో చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సురేంద్ర,జంపన ప్రతాప్,విద్యార్థులు అధ్యాపకులు పూర్వ విద్యార్థులు కళాశాల శ్రేయోభిలాషులు పాల్గొనడం జరిగింది.

## హలో మాల ఛలో ఢిల్లీ సభను విజయవంతం చేయాలి

**మాల మహానాడు జాతీయ ఆశోద కార్యదర్శి భాస్కర్**



**తొర్రూరు, విశాలభారతి:** హలో మాల ఛలో ఢిల్లీ రాజ్యాంగ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి ఆశోద భాస్కర్ పిలుపునిచ్చారు. తొర్రూరు మండలం కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షులు అనపర్తి నాగేష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల మహేష్ గారితో కలిసి భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా మతోన్మాద సంస్థల మనువాద, ఎజెండాకు పాలకులు తమకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చుకోవాలనే లక్ష్యంతో భారత రాజ్యాంగంపై వివిధ రూపాల్లో దాడి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జి ఎనమాల రాకేష్,నెల్లికుదురు మండల అధ్యక్షులు కారం ప్రశాంత్, నాయకులు ఎనమాల అంజయ్య, ప్రభాకర్, రమేష్, రాము, ధర్మయ్య,అద్దంకి యువసేన మండల అధ్యక్షులు బానాల సంజీవ, రవి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహా పుణ్యకార్యం

- ఎస్కేకలీష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం
- కులమతాలకతీతంగా అన్నదానం ఓ చక్కటి ఉదాహర




**పాల్వంచ, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఎస్కే కలీష్ ఆధ్వర్యంలో స్వాములకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం మహా పుణ్యకార్యమని అన్నారు. కార్తీక మాసంలో అయ్యప్ప స్వాములకు భక్తిశ్రద్ధలతో దీక్షలు చేస్తున్నటువంటి స్వాములకు ఆదివారం అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు .ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది భక్తులు పాల్గొన్నారు.ఒక ముస్లిం కులాలకు అతీతంగా స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పలువురు ప్రశంసించారు. భారతీయులంతా ఒకటే అనే పదానికి చక్కని ఉదాహరణగా ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరం.ఈ కార్యక్రమంలో యమహా రమేష్,అక్రమ్, బి శ్రీనివాస్ గురు స్వామి ,భోగినేని శీను,సాయిని మహేంద్ర చౌదరి, భోగినేని సందీప్, బేతం శెట్టి వెంకట, మల్లెల నాగేందర్, రెడ్డి మల్ల మణికంత ఎన్ పి చారి, రాజ్యలక్ష్మి కిషోర్ భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు


## 600 మంది క్యాన్సర్ రోగులకు అన్నదానం



**హైదరాబాద్, విశాలభారతి:** అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో, హైదరాబాద్‌లోని ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రి ప్రాంగణంలో అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది క్యాన్సర్ రోగులు, వారి సహాయకులకు రుచికరమైన ఆహారాన్ని వితరణ చేశారు. డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని మన సాంప్రదాయం చెబుతుంది. పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఒక పూట భోజనం అందించగలగడం పట్ల ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కూరడి శ్రీనివాస్, సహాధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బోలిగిడ శంకర్, ఈసీ సభ్యుడు ముకీద్ ఖురేషీ, ఏపిఆర్ఓ మొహమ్మద్ వాహిద్, టీఎన్జీఓస్ యూనియన్ క్యాన్సర్ హాస్పిటల్ అధ్యక్షుడు శివకుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మరో ప్రమాదం.. 18 మంది మృతి





( మొదటిపేజీ తరువాయి )

రాజస్థాన్ లోని ఫలోడి వద్ద మటోడా గ్రామంలో ఆగి ఉన్న ట్రక్కును భక్తులతో వెళ్తున్న ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది. దీంతో బస్సులోని 18 మంది మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మృతులంతా జోధ్ పుర్ లోని సూర్ సాగర్ ప్రాంతానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. బికనూర్ లోని కోలాయత్ ఆలయం నుంచి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తేలింది. ఈ ఘటనపై రాజస్థాన్ సీఎం భజన్ లాల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఈ ఘటన రాజస్థాన్ రాజధాని జైపూర్ కు 400 కిలోమీటర్ల దూరంలో భారత్ మాల హైవే పై మటోడా గ్రామంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మాజీ సీఎం అశోక్ గెహ్లోత్ విచారం వ్యక్తం చేశారు. మృతులకు నివాళి అర్పించారు. ఇక ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు జసల్మేర్ రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. గత నెల (అక్టోబర్ 14)న జైసల్మేర్ సమీపంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. ప్రైవేట్ బస్సు మంటల్లో చిక్కుకుని పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. అయితే, వరుసగా జరుగుతున్న ఈ ప్రమాదాలు రాష్ట్రంలో రవాణా భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## 3కే రన్ ప్రారంభించిన బాలానగర్ ఎస్ఐ



**కూకట్ పల్లి, విశాలభారతి:** దేశ ఐక్యతకు ప్రతిఒక్కరూ తన వంతు కృషి చేయాలని బాలానగర్ ఎస్ఐ సరిత రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్వామీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ నేషన్' స్ఫూర్తితో 3కే రన్ ను జండా ఊపి ప్రారంభించారు. బాలానగర్ డివిజన్ పరధిలోని ఐడిపిఎల్ డిమార్ట్ వద్ద ప్రారంభమైన ర్యాలీ గూడెన్మెట్ క్రాస్ రోడ్స్ మీదుగా కుత్బుల్లాపూర్ క్రాస్ రోడ్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఐ సరిత రెడ్డి మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతకు సర్దార్వ ల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనాథ్, కిషర్ బాబు, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గ జాతర గోడ పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే

*** ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు**
*** రూ. 1.20 కోట్ల నిధులతో బీటీ రోడ్లు ,సీసీ రోడ్లు**



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని అరుట్ల బుగ్గ జాతర సందర్భంగా ప్రత్యేక ఆహ్వాన గోడ పత్రికను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కార్తీకమాసం సందర్భంగా దక్షిణ కాశీగా పేరొందిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆరుట్ల గ్రామంలో 9 నవంబర్ 5 నుండి 20 వ తేదీ వరకు నిర్వహించే శ్రీశ్రీశ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి కార్తీక స్నాన ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించామని పేర్కొన్నారు. రూ. 1.20 కోట్ల నిధులతో బీటీ రోడ్లు ,సీసీ రోడ్లు , భక్తులకు బాత్ రూములు, ఆలయ గెస్ట్ హౌస్ కోసం నిధులను కేటాయించి బుగ్గ జాతరను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య , గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , సింగల్ విండో ఛైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి , మాజీ సర్పంచ్ లు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, యాదయ్య, చంద్రయ్య , వెదిరె సికిందర్ రెడ్డి, నీలం భాను , తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏకాదశి సర్వ పాపాలను తొలగిస్తుంది



**వనస్థలిపురం, విశాలభారతి:** వనస్థలిపురంలోని కమలానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించబడిన సామూహిక సత్యనారాయణ కథ లో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, ఈరోజు కార్తిక శుక్ల ఏకాదశి ను పురస్కరించుకొని తులసి వివాహం నిర్వహించారు. అలాగే శ్ర సత్యనారాయణ కథ లో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నేడు కార్తీక శుక్ల ఏకాదశి. దీనినే ఉత్థాన ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఈ పవిత్రమైన రోజునే శ్రీ మహావిష్ణువు నాలుగు నెలల యోగ నిద్ర నుంచి మేల్కొంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో చాతుర్మాసం ముగిసి నేటి నుంచి పెళ్లిళ్లు సహా అన్ని రకాల శుభకార్యాలు తిరిగి ప్రారంభమవుతాయి, అలాగే ఈరోజు భక్తులు ఉపవాస దీక్షతో విష్ణుమూర్తిని పూజిస్తూ తులసి వివాహం నిర్వహిస్తారు. ఈ ఏకాదశి సర్వ పాపాలను తొలగిస్తుందని నమ్మకం, అలాగే ఈ పర్వదినాన తనను ఆహ్వానించి స్వామివారి ఆశీర్వాదం లభించేలా చేసినందుకు కమలా నగర కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు.

## సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని హయత్ నగర్ డివిజన్ కమలానగర్ కాలనీ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు కమలానగర్ కమ్యూనిటీ హాల్ లో భక్తి శ్రద్ధలతో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ వ్రతంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..కార్తీక మాసం భక్తి, ఆచరణ, సేవలకు ప్రతీక. ఈ పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ ధార్మిక కార్యక్రమాలలో పాల్గొని సమాజంలో ఆధ్యాత్మికతను విస్తరించాలి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు, బీజేపీ నాయకులు, భక్తజనులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ తో కలిసి యూసుఫ్ గూడ డివిజన్‌లో జరిగిన బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయంకోసం నిర్వహించిన పదయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ..భారతీయ జనతా పార్టీ ప్రజల అభ్యున్నతికి, పారదర్శక పాలనకు, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రజలు బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి గెలుపు వరం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ కార్పొరేటర్లు, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.



# నాటు కొడవలితో వేటాడి హత్యలు

- వికారాబాద్ జిల్లాలో దారుణ ఘటన
- భర్త తన భార్య, ఇద్దరు బిడ్డలు, వదినపై దాడి
- కొడవలితో విచక్షణారహితంగా పొడిచాడు
- అనంతరం నిందితుడు ఆత్మహత్య
- ఈ దాడిలో చిన్న కూతురు తప్పించుకుంది
- డీఎస్పీ పరిస్థితులను పరిశీలించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఓ వ్యక్తి ముగ్గురు కుటుంబ సభ్యులను దారుణంగా హత్య చేసిన ఘటన వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో జరిగింది. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన వేపూరి యాదయ్య అనే వ్యక్తి తన భార్య ఇద్దరు పిల్లలతో పాటు వదినను కత్తితో నరికాడు ఇందులో పెద్ద కూతురు తప్పించుకున్నట్లు సమాచారం. మిగతా అందరినీ దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత అతను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. సానుకూల ప్రకారం సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. హత్యకు గల కారణాలు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలానికి వెళ్లి డీఎస్పీ పరిస్థితులను పరిశీలించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



అయితే ఈ ముగ్గురు హత్యలకు కారణం కుటుంబ కలహాలేనని తెలుస్తోంది. పోలీసుల వివరాలు ప్రకారం భార్య అలివేలు, ఆమె సోదరీ హనుమమ్మ, చిన్న కూతురు శ్రావణి నిద్రిస్తుండగా యాదయ్య ఈరోజు తెల్లవారుజామున 3 గంటల సమయంలో కత్తితో పొడిచి హత్య చేశాడు. అయితే పెద్ద కూతురుపై కూడా దాడి చేయగా అపర్ణ అక్కడి నుంచి తప్పించుకుంది. అనంతరం ఆయన కూడా సూసైడ్ చేసుకున్నాడు. ఇక ఈ ఘటనపై తీవ్రంగా పరిగణించిన డీఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఇక మృతదేహాలను స్థానికంగా ఉన్న ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడిన పెద్ద కూతురు అపర్ణ.. ఘటనకు సంబంధించి అధికారులకు వెల్లడించింది. ట్రిపుల్ మర్డర్ కేసులో తప్పించుకున్న ఈ పెద్ద కూతురు రాత్రి తన పెద్దమ్మతో నాన్న గొడవ పడ్డాడు. ఆ తర్వాత నిద్ర పోయాం, అయితే ఒక్కసారిగా నాన్న పెద్దమ్మను కత్తితో నరికాడు. దీంతో భయందోళనకు గురయ్యారు తల్లిపిల్లలు. తన తల్లి వచ్చి పెద్దమ్మను చంపుతుండటం ఆపుతుండగా ఆమెను కూడా నరికి చంపేశాడట. వారిద్దరూ చనిపోయి రక్తపుమడుగులో పడి ఉన్నారు. దీంతో మీరు కూడా ఎందుకు అని చెల్లిని నరికాడు.. తనపై కూడా దాడి చేయడానికి రాగానే తప్పించుకొని పారిపోయింది. ఆ తర్వాత నాన్న చచ్చి పోయాడు అని చెప్పుకొచ్చింది.

# జయహో భారత్



- ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం
- ఇది సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి జరిగింది
- కక్ష్యలోకి ఉపగ్రహం విజయవంతంగా చేరింది
- ఉపగ్రహం 15 ఏళ్ల పాటు సేవల అందించనుంది
- ఈ ప్రయోగం భారత కీర్తి ప్రతిష్ఠలను మరో మెట్టుపైకి
- ఉపగ్రహం బరువు మొత్తం 4,410 కిలోలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి నవంబరు 2 ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు చేపట్టిన ఎల్‌వీఎం3ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. 24 గంటల కౌంట్‌డౌన్ ప్రక్రియ అనంతరం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం3ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్03 ఉపగ్రహాన్ని నింగిలోకి విజయవంతంగా పంపారు. అన్ని దశలను దాటుకుని నిర్దేశిత భూ అనువర్తి బదిలీ కక్ష్యలోకి ఉపగ్రహం విజయవంతంగా చేరింది. కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత మెరుగుపరచడంతో పాటు సముద్ర వాతావరణ పరిస్థితుల గురించి కచ్చితమైన సమాచారం ఈ ఉపగ్రహం అందజేయనుంది. ఇది 15 ఏళ్ల పాటు సేవల అందించనుందని ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ తెలిపారు. ఈ ప్రయోగం భారత కీర్తి ప్రతిష్ఠలను మరో మెట్టుపైకి ఎక్కించిందని ఆయన అన్నారు. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు.యుద్ధనౌకలు, జలాంతర్గాములు, భూ నియంత్రణ కేంద్రాలతో సురక్షితమై కమ్యూనికేషన్లు సాగించేందుకు ఇది తోడ్పాటు అందిస్తుంది. ముఖ్యంగా హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న చైనా కదలికలను అడ్డుకోడానికి ఈ శాటిలైట్ సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుంది. మొత్తం 4,410 కిలోల బరువుండే సీఎంఎస్3.. భూ అనువర్తిత బదిలీ కక్ష్య (జీటీవో)లోకి భారత్ భూభాగం నుంచి ప్రయోగించిన ఉపగ్రహాలన్నింటిలోనూ అత్యంత బరువైందిగా గుర్తింపు పొందింది.

బహుళబ్యాండ్ సీఎంఎస్03 భారత ఉపఖండం చుట్టూ విస్తరించిన సముద్ర ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ సేవలను మెరుగుపరచనుంది. ముఖ్యంగా ఇండియన్ నేవీ కోసం ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. జీశాట్ 7ఆర్ అని కూడా పిలిచే ఈ ఉపగ్రహాన్ని 2013 నుంచి సేవలు అందిస్తున్న జీశాట్ 7 స్థానంలో ప్రయోగించారు. ఆడియో, వీడియో, డేటా కమ్యూనికేషన్లు రహస్యంగా, సురక్షితంగా సాగేందుకు సి, ఎక్స్‌టెండెడ్ సి, కేయూ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్లు ఇందులో అమర్చారు. విదేశీ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడటాన్ని ఈ ఉపగ్రహం తగ్గిస్తుంది. యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, తీరంలో నౌకా స్థావరాల మధ్య సురక్షితమైన కమ్యూనికేషన్ అందజేయనుంది. టెలికమ్యూనికేషన్ అనుసంధానం కూడా దీని ద్వారా పెరుగుతుంది. మెరుగైన, హై బ్యాండ్‌విడ్త్‌ను కూడా ఇది అందిస్తుంది. మారుమూల ప్రాంతాలకు డిజిటల్ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వ్యూహాత్మక అవసరాలతోపాటు పౌర సంస్థలకూ ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. అంతేకాదు, శత్రువులను మన కమ్యూనికేషన్ల జామ్ చేసేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటుంది. తీరప్రాంత భద్రత, సముద్రంలో దోపిడీలను నిరోధించే ఆపరేషన్లు, విపత్తు సహాయ చర్యలకు సహకరిస్తుంది భారత తీరం నుంచి 2వేల కి.మీ. దూరం వరకూ విస్తరించిన ప్రాదేశిక జలాల్లో సేవలు అందించగలదు. ఇక, కౌంట్ డౌన్ ప్రారంభానికి ముందు ఇస్రో చైర్మన్ వీ నారాయణ, షార్ డైరెక్టర్ పద్మ కుమార్‌లు రాకెట్ నమూనాలకు తిరుమల శ్రీవారి ఆలయంలో.. శ్రీకాళహస్తిలోని స్వామి వారి సన్నిధిలో..సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.